

'అంగన్వాడీ' జిల్లా మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఈనెల 17న స్థానిక ప్రీతం రెసిడెన్సిలో నిర్వహించబోయే ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) అనుబంధం అన్నమయ్య జిల్లా మొదటి మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ. రామాంజులు పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాల ఆవరణలో నిర్వహించిప విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసిడిసి వ్యవస్థ పట్ల చిన్నచూపు చూస్తున్నాయని, అందులో భాగంగానే ఐసిడిఎస్‌కు నిధులు తగ్గించడం, వసతులు కల్పించకపోవడం చేస్తున్నాయని విమర్శించారు. రాయచోటి ఐసిడిస్ ప్రాజెక్ట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఉపాధ్యక్షురాలు వి. సిద్ధమ్మ, ఎస్. భాగ్యలక్ష్మి. పి. ఖాజాబీ మాట్లాడుతూ పాలకులు, ప్రభుత్వాలు మారినప్పటికీ ఐసిడిఎస్ వ్యవస్థ పూర్తిస్థాయి అభివృద్ధికి నోచుకోవడం లేదని వాపోయారు. అంగన్వాడి వర్కర్లు, మినివర్కర్లు, హెల్పర్ల సమస్యలపైనా, ఐసిడిఎస్ అభివృద్ధిపైనా మూడు సంవత్సరాలకు ఒకసారి జరిగే మహాసభలో చర్చించి ముందుకెళ్లడానికి ప్రాజెక్టులోని వర్కర్లు హెల్పర్లు పాల్గొని జయప్రదం చేయవలసిందిగా పిలుపునిచ్చారు.

'నాడు-నేడు పనులు గడువులోగా పూర్తిచేయాలి'



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ గిరీష, అధికారులు

ప్రజాశక్తి - రాయచోటి

మనబడి నాడు-నేడు రెండవ విడత పనులను నిర్దేశించిన గడువు లోపల పూర్తి చేయాలని పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం విజయవాడలోని సమగ్ర శిక్షా కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా విద్యాశాఖ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులతో రెండవ దశ మనబడి 'నాడు-నేడు' పనుల పురోగతి పై పాఠశాలల ఇన్‌ఫ్రాస్ట్రర్ కార్యదర్శి కాటమనేని భాస్కర్‌తో కలిసి విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ గిరీష పిఎస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను ప్రస్తుతం ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేర్చే లక్ష్యంతో రెండో విడత మనబడి నాడు-నేడు పనులు చేపడుతున్నామని చెప్పారు. నాణ్యతతో నిర్దేశించి చేసిన పనులకు సంబంధించి ఎప్పటికప్పుడూ ఖర్చులు ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా ఇంజినీరింగ్ అధికారులకు మార్గదర్శకాలు జారీ చేయాలని కలెక్టర్లకు సూచించారు. మంజూరైన ఎసిఆర్‌లకు సంబంధించిన పనులు వెంటనే ప్రారంభించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడొద్దన్నారు. ప్రతి పాఠశాలలో గణనీయంగా మార్పులు కనిపించాలని చెప్పారు. ఈ దిశగా అధికారులు బాధ్యతతో పని చేయాలని స్పష్టం చేశారు. జరుగుతున్న పనులకు సంబంధించి క్షేత్ర స్థాయిలో ఎటువంటి సమస్యలు ఎదురైనా వాటిని వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేసి సమస్య పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ గిరీష పిఎస్ అధికారులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మనబడి నాడు-నేడు పనులు నిర్దేశించిన గడువు లోపు పూర్తి చేయాలన్నారు. ఇసుక సమస్య తలెత్తకుండా అవసరం మేరకు స్టాక్ పాయింట్ల నుంచి ఇసుక తెప్పించుకోవాలని చెప్పారు. ఎక్కడైనా ఇసుక సమస్య ఉన్నట్లయితే వెంటనే సంబంధిత తహశీల్దార్, ఆర్‌డిఒలకు తెలియజేసి పరిష్కరించుకోవాలన్నారు. అలాగే సిమెంటుకు కూడా ముందస్తు ఇండెంట్లు పంపాలన్నారు. అన్ని పాఠశాలల్లో చేసిన పనులకు సంబంధించిన ఖర్చులను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. నాడు-నేడు పనులను అధికారులు బాధ్యతగా తీసుకొని నిర్దేశించిన గడువు లోపల పూర్తిచేసి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డిఇఒ రాఘవరెడ్డి, ఐసిడిఎస్ పీడీ నిర్మల, ఆర్డబ్ల్యూఎస్ ఎస్‌సి ప్రసన్న కుమార్, డిఐఈఓ కృష్ణయ్య, నాడు నేడు ఇన్‌ఛార్జ్ కో-ఆర్డినేటర్ కరుణాకర్, సమగ్ర శిక్ష ఇఇ లు పాల్గొన్నారు.

ఐద్వా పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సాహిన, లక్ష్మీదేవి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఐద్వా పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సాహిన, లక్ష్మీదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం స్థానిక విజయనగర్ కాలనీలో ఐద్వా పట్టణ మొదటి మహాసభ సాహిన అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా ఐద్వా జెండాను ఆవిష్కరించి అమరులైన మహిళా నాయకులకు నివాళి అర్పించారు. అనంతరం జరిగిన సభలో ఐద్వా జిల్లా నాయకులు భాగ్యమ్మ మాట్లాడుతూ 75 ఏళ్ల స్వాతం త్ర్యం వచ్చిన సందర్భంగా మోడీ ప్రభుత్వం ఆజాద్‌కి అవృత మహోత్సవం పేరుతో కార్యక్రమాలు చేపట్టారు కానీ నేడు మహిళలపై దేశంలో లైంగిక వేధింపులు, అత్యాచారాలు, అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయని పేర్కొన్నారు. మహిళలు పోరాడి సాధించుకున్న చట్టాలు, హక్కులు ఉన్నాయని, వాటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదన్నారు. మల్లు స్వరాజ్యం, చాకలి ఐలమ్మ వంటి మహానుభావులు అందించిన స్ఫూర్తితో మహిళా హక్కుల కోసం, చట్టాల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మహిళలకు ఉపాధి అవ కాశాలు కల్పించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, మహిళల సమ స్యలను పరిష్క రించాలని డిమాండ్ చేస్తూ రానున్న కాలంలో పెద్దఎత్తున ఉద్య మిస్తామని, పోరాటాలకు మహిళలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఐద్వా నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా రెడ్డిరాణి, సహా య కార్యదర్శిగా నసీమా, కమిటీ సభ్యులుగా ఉషారాణి, ధనలక్ష్మి, శాంతమ్మ ఎన్నిక య్యారు. కార్యక్రమంలో నాయకులు మధురవాణి, శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఐద్వా పట్టణ నూతన కమిటీ సభ్యులు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఘనంగా జిల్లా యువజన ఉత్సవాలు

ప్రజాశక్తి - రాయచోటి

స్థానిక సాయి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం జిల్లా యువ జన ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డి స్వామి వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతరం బలోపేతమైనప్పుడే భావి భారత నిర్మాణం సాధ్యమవుతుందని పారిశ్రామికంగా సాంకేతికంగా ఆర్థికంగా యువత ఆలోచనలు దేశాభివృద్ధికి దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాధరెడ్డి మాట్లాడుతూ యువజన ఉత్సవాల నిర్వహణలో భాగంగా నిర్వహించిన జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలను సద్వినియోగం చేసుకొని యువత అన్ని రంగాల్లో రాణించాలని చెప్పారు. అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. సాయి విద్యాసంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ ఎం సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ యువజన ఉత్సవాలను జయప్రదం చేసినందుకు జిల్లాలోని ప్రభుత్వ యంత్రాంగానికి కళాశాలల అధ్యాపకులకు విద్యార్థులకు కృతజ్ఞతలు తెలియజేశారు. వివిధ అంశాల పో టీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలను ప్రశంసా పత్రాలను బహుకరించారు. వివిధ కళాశాల విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాలలు, ఇంటర్, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, మున్సిపల్ చైర్మన్ షేక్ ఫయాజ్ బాష, కౌన్సిలర్ ఈశ్వర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రముఖ ఉర్దూ కవికి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు

రాయచోటి టౌన్ : లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుకు ప్రముఖ ఉర్దూ కవి షేక్ మమ్మమ్మద్ హాషీం ఎంపికయ్యారు. ఆయన రాయచోటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నేతాజీ సర్కిల్ వద్ద ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. గతంలో జిల్లా బెస్ట్ టీచర్ అవార్డు, సర్సయ్యద్ అవార్డు, ఫక్రే ఉర్దూ అవార్డు , సాహితీ సేవలకు గుర్తింపుగా అంజుమన్ తరఖీ? ఉర్దూ వారిచే లైఫ్ టైం అచ్యుమెంట్ అవార్డు తీసుకున్నారు. లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ఈనె 11న గుంటూరులోని మైనార్టీ ఎడ్యుకేషన్ సెమినార్ రోజు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అందుకోకున్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

నందలూరు: మండలంలోని నల్లతిమ్మాయ్యపల్లి సచివాలయంలో ఎంపిడిఒ సౌభాగ్యమ్మ గురువారం న్యాయసేవలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాలు నివారించాలని తెలిపారు. పల్లెల్లో ఎక్కువగా బాల్యవివాహాలను ప్రోత్సహిస్తూ చిన్న పిల్లలను ఇబ్బందులు పాలు చేస్తున్నవారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. వారికి ఒక సంవత్సరం పాటు జైలు శిక్ష, రూ.రెండు లక్షల వరకు జరిమానా విధిస్తారని పేర్కొన్నారు. మహిళలను వేధించడం, ర్యాగింగ్ చేయడం వంటివి చేస్తే న్యాయస్థానం కఠిన చర్యలు తీసుకుంటాయని తెలిపారు. అనంతరం నల్ల తిమ్మయ్యగారిపల్లిలోని పాఠశాల వెళ్లి మధ్యాహ్న భోజనంను తనిఖీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భ్రమరాంబిక, సచివాలయం సిబ్బంది, వాలంటీర్స్ పాల్గొన్నారు.

ఆర్ఆర్ గృహంలో సినిమా చిత్రీకరణ

లక్కిరెడ్డిపల్లె: మండల కేంద్రమైన లక్కిరెడ్డిపల్లిలో మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి స్వగృహంలో గురువారం భరత్ ఫిలిం ఫ్యాక్టరీ, పిజె (పూరికి స్వారీ..జగన్నాథ్ గాడి స్టోరీ) అనే సినిమా చిత్రీకణ చేశారు. హీరో భరత్, హీరోయిన్లు ప్రీతి నిత్యసారా చిత్రీకరణలో పాల్గొన్నారు. షూటింగ్‌లో శేషింగ్ శేషు, అంబటి శ్రీనివాస్, బాహుబలి ప్రభాకర్, అజయ్ సమ్మెట గాంధీ పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సినిమా చిత్రీకరణ చేశామని నిర్మాత భరత్ కుమార్, డిఒపి హజరత్‌షేక్, దర్శకుడు సంతోష్ కుమార్ తెలిపారు.

రియల్ ఎస్టేట్‌పై ఆశానిరాశలు

- తొలగిన జిల్లా కేంద్రం భ్రమలు
- డైలమాలో వ్యాపారులు, కొనుగోలుదారులు



అమ్మకాలు నిలిచిపోవడంతో వదిలేసిన స్థలం

ప్రజాశక్తి- రాయచోటి

రియల్ ఎస్టేట్‌లో వ్యాపారుల ఆశలన్నీ నిరాశలుగా మిగిలిపోయాయి. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో గత వైభవం వస్తుందని వ్యాపారులు ఆశించారు. అనుకున్నట్లే రాయచోటిని అన్నమయ్య జిల్లాగా ఏర్పాటు చేశారు. నూతన కలెక్టరేట్, ఎస్‌పి కార్యాలయం ఏప్రిల్ 4న ప్రారంభించారు. దీంతో రాయచోటి ప్రాంతాల్లోని భూములకు ఒక్కసారిగా ధరలు ఆకాశంలోకి ఎగబాకాయి. చాలా మంది పట్టణంలో స్థలం కొనాలన్ని ఉత్సాహం చూపించారు. దీన్ని అవకాశంగా మార్చుకుని రియల్ వ్యాపారులు, కొనుగోలు దారులకు ఇదిగో, అదిగో ప్రభుత్వ కార్యాలయాలని మాయమాటలు చెప్పి రూ.కోట్లు పెట్టి కొనుగోలు చేయించారు. ఎక్కడ పడితే అక్కడ, ఎంత పడితే అంత ధర పెట్టి స్థలాలు కొనుగోలు చేశారు. తమ దగ్గర డబ్బు లేకపోయినా దొరికిన చోటల్లా అప్పులు చేసి మరీ కొనుగోలు చేశారు. రింగ్ రోడ్డు చుట్టూ 30 శాతం నుంచి 70 శాతం వరకూ ధరలు పెంచేశారు. గతంలో ఎకరా ధర రూ.20 నుంచి 30 లక్షల వరకు ఉండేవి. ప్రస్తుతం కోట్లకు చేరాయి. రాత్రికి రాత్రే ఏదో అద్భుతం జరిగిపోతుందనే భ్రమలు బ్రోకర్లు కల్పించారు. గడిచిన 8 నెలల్లో పరిస్థితి పూర్తిగా తలకిందులయ్యాయి. జిల్లా కేంద్రమైతే ఒక్కసారిగా పట్టణానికి ఏదో మేలు కలుగుతుందని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ఉన్న భూములకు ఎక్కడా లేని గిరాకీ వస్తుందని అనుకున్నారు. కానీ ఆ భ్రమలు చాలా నెమ్మదిగా తొలగిపోయాయి. జిల్లా కేంద్రం ఏర్పడడంతో పాటు అందుబాటులో ఉన్న చోట ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పడి 6 నెలలు గడిచినా ఎక్కడ నూతన భవన నిర్మాణాలు ప్రభుత్వం చేపట్టలేదు. సాధారణ పరిపాలన పుంజుకోలేదు, ధరలు పెరిగింది లేదు. రియల్ ఎస్టేట్ వ్యాపారం వాస్తవ ధరల కంటే ఎక్కువ ధరలకు భూములు కొనుగోలు చేసిన వారు అధిక రేట్ల కోసం ఎదురు చూస్తున్నారు. గతంలో కోట్లు పెట్టి కొనుగోలు చేసిన వ్యాపారులు ఇప్పుడు అమ్ముదామంటే కొనేవారు కనుచూపు మేరలో కనిపించడం లేదు. అసలు ధర వస్తే చాలని ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం తీవ్ర ఆర్థిక సమస్యల్లో ఉన్న నేపథ్యంలో కొత్త జిల్లా కేంద్రాలలో కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేకపోతోందని అధికారులు, ప్రజలు వాపోతున్నారు. ఫలితంగా భూములకు ఇప్పట్లో ధరలు పెరిగే అవకాశం కనిపించడం లేదని పలువురు పేర్కొంటున్నారు. అగ్రిమెంట్ల మీద రూ . కోట్ల వ్యాపారాలు రియల్ ఎస్టేట్ వ్యాపారులు జోరుగా నిర్వహించారు. 6 నెలలు ,9 నెలలు గడువు పెట్టుకుని స్థలం మొత్తం విలువలో 25 శాతం తీసుకుని, గడువులోగా మిగిలిన 75 శాతం చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. అనుకున్న ప్రకారం వ్యాపారాలు జరగకపోవడంతో పలువురు గడువు తీరినా ఇవ్వాల్సిన మొత్తం ఇవ్వకపోతే అగ్రిమెంటు సమయంలో ఇచ్చిన 25 శాతం డబ్బు చెల్లించలేక పోతున్నారు. తాము ఇచ్చిన 25 శాతం మొత్తం మేరకు తమకు స్థలం రిజిస్ట్రేషన్ చేయిస్తే చాలని భూములు కొనుగోలు చేసిన వారు పేర్కొంటున్నారు. ఇలా వివాదాలు ఏర్పడి నిత్యం పెద్ద మనుషుల, పోలీసు స్టేషన్, మరికొందరు కోర్టును ఆశ్రయిస్తున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం కొందరికి లాభాలు చేకూర్చితే, కొందరిని నష్టాలలోకి నెట్టిందనే చెప్పవచ్చు. ఇంక రియల్ ఎస్టేట్ ధరలు పెరిగే అవకాశం లేదని , తమకు లాభాల మాట దేవుడెరుగు కనీసం అసలిచ్చినా తమ భూములు అమ్మేస్తామని పలువురు రియాల్టర్లు చెబుతున్నారు .అడ్డు అదుపు లేకుండా సాగిన రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని అడ్డుకునే వ్యవస్థ లేకపోవడంతోనే ఈ సమస్యలు వస్తున్నాయిని పలువురు చర్చించుకుంటున్నారు.

'వెలిగల్లు' నీటితో చెరువులను నింపాలి

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రామాంజులు

ప్రజాశక్తి-రామాపురం

వెలిగల్లు ప్రాజెక్టు పరిధిలోని పంటకాల్వలకు వంద కోట్లు బడ్జెటు కేటాయించి పూర్తి చేసి రాయచోటి నియోజకవర్గంలోని ప్రతి చెరువు, కుంటకు నీరివ్వాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు. ఎ.రామాంజులు డిమాండ్ చేశారు. గురువారం రామాపురం మండలం గంగనేరు జలాశయాన్ని సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ వెలిగల్లు సాగు నీటి ప్రాజెక్టు ప్రారంభించి దాదాపు పదేళ్లయినప్పటికీ కేవలం గాలివీడు, రాయచోటికి మాత్రమే తాగునీరు అందించడానికి ఉపయోగపడుతుందే తప్ప సాగు వరకు రావడం లేదని చెప్పారు. 4.6 టిఎంసిల సామర్థ్యం ఉన్న ప్రాజెక్టు నిండినప్పుడు గేట్లు ఎత్తి లక్షల క్యూసెక్కుల నీటిని వృథాగా వదిలేస్తున్నారని వాపోయారు. పెండింగ్‌లో ఉన్న పంట కాల్వలు పూర్తి చేసి నియోజకవర్గంలోని మండలిపల్లి రిజర్వాయర్, ఝరికోన, గంగనేను ప్రాజెక్టులతోపాటు చెరువులు, కుంటలు నింపి వ్యవసాయానికి నీటిని అందించడంతోపాటు గ్రామాల్లో భూగర్భ నీటి సామర్థ్యం పెరుగుతుందని చెప్పారు. ఫలితంగా వ్యవసాయంతో పాటు పశువులకు గడ్డి ,దాన ,పాడి పరిశ్రమ, మత్స్య పరిశ్రమ అభివృద్ధి చెంది రైతన్నకు, ప్రభుత్వాలకు ఆదాయం వచ్చే మార్గం ఉండేదని అన్నారు. ఇప్పటికే ధరల పెరిగిపోయి, గిట్టుబాటు ధర రాక రైతు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో పంట కాల్వలను పూర్తి చేసి వారికి వ్యవసాయంపై ఆశ కలిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎంరామపురం మండల కార్యదర్శినాగబసిరెడ్డి, బి.వెంకట్రామిరెడ్డి పి.జయప్రకాష్. పాల్గొన్నారు



గంగనేరు జలాశయాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

వేమన విగ్రహం తొలగింపు దుర్మార్గం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయంలో వేమన విగ్రహ తొలగింపుపై దారుణమని టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణు గోపాల్ అన్నారు. టిఎన్‌ఎస్‌ఎఫ్ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లా డుతూ ప్రజాకవి వేమన విగ్రహానికి బదులు యూనివర్సిటీ అధికారులు వైఎస్ విగ్రహం పెట్టడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి యూనివర్సిటీ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వికారి నామ సంవత్సరంలో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభు త్వం ప్రజలు జీర్ణించుకోలేని వికారపు చేష్టలతో పాలన సాగిస్తుందని దుయ్య పట్టారు. ప్రభుత్వ కార్యాలయాలకు పార్టీ రంగులు వేయడం, యూనివర్సిటీలకు పేర్లు మార్చడం, మహాత్ముల విగ్రహాలు తీసి జగన్ తండ్రి వైఎస్ విగ్రహాలు పెట్టడం అలవాటుగా మారిందన్నారు. తండ్రిపై నిజంగా జగన్ కు ప్రేమ ఉంటే ఇడుపులపాయలో గుడి కట్టి బంగారు విగ్రహాన్ని పెట్టి పూజిస్తే తండ్రిపై గౌరవం ఉన్న వ్యక్తి జగన్ అని రాష్ట్ర ప్రజలు హర్షిస్తారనిన్నారు. వెంటనే వైఎస్ విగ్రహాన్ని తీసి వేమన విగ్రహాన్ని యధా స్థానంలో ఉంచాలని, లేనిపక్షంలో యూనివర్సిటీలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో టిఎన్‌ఎస్‌ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు నబి రసూల్, ఉపాధ్యక్షులు నాగరాజు, అధికార ప్రతినిధి సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

వాలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి- కలకడ

వాలంటీర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపిడిఒ సిహెచ్ నారాయణ తెలిపారు. మండలంలోని ఎర్రకోటపల్లి పంచాయతీ పాపిరెడ్డిగారిపల్లి సచివాలయం పరిధిలో ఉన్న ఎర్రకోటపల్లిలో బిసి మహిళకు చెందిన ఒక పోస్ట్ ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు ఈ నెల 11 నుండి 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులను ఈ నెల 12 నుండి 20వ తేదీలోగా పరిశీలించడం జరుగుతుందని, 21, 22 ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందని, ఎన్నికైన అభ్యర్థులకు 24న శిక్షణ ఉంటుందని, 25న పోస్టింగ్ ఇస్తామని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నరసింహ

కళాశాలల్లో సమస్యలు పరిష్కరించాలి: ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలు పరిష్క రించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు. పట్టణంలోని స్థానిక జూనియర్ కళాశాలలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో కనీసం మౌలిక వసతులు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని పేర్కొన్నారు. జూనియర్ కళాశాలలు ప్రారంభించి నేటికీ 5నెలలు అవుతున్నప్పటికీ పాఠ్య పుస్తకాలు ఇంతవరకు ఇవ్వకపోతే విద్యార్థులు ఎలా చదువుతారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయలేదని గెస్ట్ ఫ్యాకల్టీని నియమించకపోవడంతో విద్యార్థులు అన్నమయ్య జిల్లావ్యాప్తంగా ఉత్తీర్ణత శాతం చాలా దారుణంగా పడిపోయే పరిస్థితి ఉందని వాపోయారు. కలెక్టర్ స్పందించి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవసరమైన గెస్ట్ ఫ్యాకల్టీని నియమించి విద్యార్థులకు సిలబస్ పూర్తి చేసి పరీక్షలకు సంసిద్ధం చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లావ్యాప్తంగా జూనియర్ కళాశాలలో సైన్సు, మ్యాథ మెటిక్స్, ఇంగ్లీషు, సబ్జెక్టులకు దాదాపు లెక్చరర్ లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పరీక్షల్లో ఏం రాయాలో అర్థం కావడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. 600 మంది విద్యార్థులు చదువుతున్న కళాశాలలో కూడా లెక్చరర్లు ఒకరు మాత్రమే ఉండడం విద్యార్థులకు సరైన విద్య అందడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ స్పందించి జూనియర్ కళాశాల సమస్యలను తక్షణమే పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఫక్రుదిన్, చంద్ర మోహన్, శ్రీనాథ్, రెడ్డి పవన్ పాల్గొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

అధునాత వైద్య సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని తిరుపతి రోడ్డులో శశి ఆర్థో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను మంత్రి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లా డుతూ రోజు రోజుకూ వైద్య రంగంలో వస్తోన్న మార్పులకు తగ్గట్టుగా గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన పెరుగుతోందన్నారు. ఆరోగ్య అవసరాలకు తగ్గట్టుగా వైద్యులు తమ వైద్యశాలలను క్షేత్రస్థాయికి విస్తరింపజేస్తుండడం మంచి పరిణామన్నారు. ప్రజలు ఆరోగ్య విషయంలో తలెత్తే సమస్యలను ప్రారంభదశలోనే గుర్తించి, తమకు అందుబాటులోకి వస్తున్న ఆధునిక వైద్యాన్ని, వైద్య సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ చికిత్స పొందాలని చెప్పారు. పీలేరు లాంటి గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎముకులకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి అధునాతన వైద్యాన్ని అందుబాటులోకి తీసుకు రావాలన్న లక్ష్యంతో ఇక్కడ డాక్టర్ శశిభూషణ్‌రెడ్డి శశి ఆర్థో మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌ను తీసుకు వచ్చారన్నారు. డాక్టర్ మాట్లాడుతూ తమ దగ్గర ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీ, మోకాలి చెప్ప మార్పిడి, వెన్నుముక, స్పైనల్ సమస్యలకు అధునాత వైద్య పద్దతిలో వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అందరికీ అందుబాటులో ఉండే ధరలకు పీలేరులోనే వైద్యం సులభంగా చేసుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, జడ్‌పిటిసి ఏటి రత్నశేఖర్‌రెడ్డి, రామచంద్రాపురం ఎంపిపి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, ఇతర వైసిపి నాయకులు, కార్యకర్తలు, స్థానిక వైద్యులు డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి, దినేష్‌రెడ్డి పాల్గొన్నారు. మంత్రి పట్టణంలో ఎంఎం రెసిడెన్సీ, ఎర్రగుంటపల్లి ఎంపిటిసి అమర్‌నాథ్ రెడ్డికి చెందిన ఫార్మాసూటికల్స్‌ను ప్రారంభించారు.



డయాగ్నోస్టిక్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి రామచంద్రారెడ్డి

సూక్ష్మనీటి పథకంపై రైతులకు అవగాహన కల్పించాలి

- ఎపిఎంఐపి జిల్లా అధికారి ఎం.వెంకటేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

సూక్ష్మనీటి సాగునీటి పథకం పరికరాల వినియోగంపై రైతు భరోసా కేంద్రాల సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలని ఎపిఎంఐపి జిల్లా అధికారి ఎం.వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఎపిఎంఐపి ఆధ్వర్యంలో గురువారం రైతులకు మంజూరయ్యే మైక్రోఇరిగేషన్ పరికరాలు అమర్చే విధానాలపై బి.కొత్తకోట, పిటిఎం, ములకలచెరువు మండలాల్లోని ఆర్‌బికె సిబ్బందికి గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.వెంకటేశ్వరరెడ్డి, ఉద్యానవన అధికారి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ రైతులందరూ ఎపిఎంఐపి రిజిస్ట్రేషన్లు రైతు భరోసా కేంద్రంలో నమోదు చేయుంచుకోవాలన్నారు. పరికరాలని ఏవిధంగా అమార్చుకోవాలనే అంశాలపై రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి సూచలు ఇచ్చారు. పరికరాలను అమర్చేటప్పుడు దగ్గరుండి తగు సూచనలు ఇవ్వాలని సూచించారు. సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీ, పెద్ద రైతులకు 70 శాతం సబ్సిడీ ఇస్తామన్నారు. రైతుల పరస్పర సహాయక సంఘాలు మూడు మండలాలకు గాను 9 కలెక్షన్ సెంటర్లు, మూడు కోల్డ్ స్టోరజ్ రూమ్స్ మంజూరయ్యాయన్నారు. ఆసక్తి గల ఎఫ్‌పిఒ గ్రూపులు తమ సమీపంలోని ఆర్‌బికె సిబ్బందిని లేదా ఉద్యాన అధికారిని సంప్రదించాలన్నారు.



సూక్ష్మనీటి పరికరాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు : డిఎస్‌పి

ప్రజాశక్తి-కలికిరి

అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా నిర్మూలించడమే ప్రధాన ధ్యేయమని డిఎస్‌పి శ్రీధర్ పోలీసులకు సూచించారు. గురువారం ఆయన కలిగే పోలీస్ స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తపరిచినారు. సిబ్బంది బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అసాంఘిక కార్యక్రమాలకు తావు లేదంటూ అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వాయల్పాడు సిఐ బిఎస్.సురేష్, కలికిరి ఎస్‌ఐ సి.లోకేష్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మైనింగ్ లీజును రద్దు చేయాలి

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని మడితాడు పంచాయతీ వానరాచపల్లి బిడికి సమీపంలో మైనింగ్ కోసం ఇచ్చిన లీజును రద్దు చేయాలని మాజీ జడ్‌పిటిసి, వైసిపి నాయకులు ఎర్రపురెడ్డి జయమ్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వందలాదిమంది గ్రామస్తులు, పదుల సంఖ్యలో రైతులు వ్యతిరేకిస్తున్న లీజును వెంటనే రద్దు చేయాలన్నారు. రైతు పొలాలు, పల్లెల సమీపంలో మైనింగ్ నిర్వహిస్తే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

కేన్సర్ పట్ల అవగాహన అవసరం

ప్రజాశక్తి-పీలేరు

ప్రమాదకర రసాయనాలతో కూడిన పొగాకు ఉత్పత్తుల వాడకంతో నివారణ సాధ్యంకాని అసంక్రమిత వ్యాధులు వచ్చే అవకాశం ఉందని తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. గురువారం మండలంలోని ముడుపులవేములలో గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ సేవలు కార్యక్రమంలో భాగంగా పొగాకు ఉత్పత్తులు-కేన్సర్ వ్యాధి అనే అంశంపై ప్రజలకు అవగాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, సిహెచ్ఒ ముత్యం, ఎఎన్ఎం వసుందర, వెంకటరత్నం, డేటా ఎంట్రీ నాగసుధ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి : ఎంపిపి

ప్రజాశక్తి-నందలూరు

విద్యార్థులకు మంచి విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపిపి మేడా విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం మహాత్మా జ్యోతిబా పూలే కళాశాల ప్రిన్సిపల్ మౌనిక, ఎంపిపి మేడా విజయ భాస్కర్‌రెడ్డిని మండల పరిషత్ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ పిల్లలకు మంచి భోజనం అందించాలన్నారు. మెనూ ప్రకారం ప్రతి రోజూ ఆహారపదార్థాలను పెట్టాలని సూచించారు. ప్రతి రోజూ మంచి విద్యను అందించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ నెల 14వ తేదీన జరిగే బాలల దినోత్సవం వేడుకల్లో పాల్గొనాలని కళాశాల ప్రిన్సిపల్ మౌనిక ఎంపిపిని ఆహ్వానించారు. కార్యక్రమంలో నాగిరెడ్డిపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు విరివిగా రుణాలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని వైయస్సార్ క్రాంతి పతం మహిళా సంఘ సభ్యులకు విరివిగా రుణాలు ఇచ్చామని శ్రీనిధి మేనేజర్ వేణుగోపాల్ తెలిపారు. గురువారం శ్రీ శక్తి భవన్‌తో సిసిలతో సమావేశం నిర్వహించారు. శ్రీనిధి రుణాలు తీసుకున్న సభ్యులు తిరిగి చెల్లింపులు భేష్ అన్నారు. 98 శాతం తిరిగి చెల్లింపులు చేయడం సిసిల పనితీరుకు నిదర్శనమన్నారు. మండలంలో రూ.4.90 కోట్లు శ్రీనిధి రుణాలు ఇచ్చేందుకు టార్గెట్ కాగా ఇప్పటి వరకు రూ.4.10 కోట్ల రుణాలుగా ఇవ్వడం జరిగిందన్నారు. మిగిలినది కూడా త్వరలో పంపిణీ చేయాలని సిసిలకు సూచించారు. సమావేశంలో ఎపిఎం మురళి, సిసిలు భవాని శంకర్ రమణ, సుబ్బరాం, తులసి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా సిపి బ్రౌన్ జయంతి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం మండలంలోని గండబోయనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సిపి బ్రౌన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సిపి బ్రౌన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో జెవివి అధ్యక్షులు ప్రభుచరణ్, హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు కిషోర్, శ్రీకాంత్, మురళి, శేఖర్, మునిరత్నం, ఉషారాణి, శారద, సిరాజున్నీసా, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి - వీరబల్లి

అన్నిదానాల్లో అన్నదానం గొప్పదని స్థానిక తెలుగుదేశం నాయకుడు శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం షిర్డీసాయి మందిరంలో దాత వంగిమల్ల బాబు రాజేంద్రప్రసాద్‌రెడ్డి ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గురువారమూ దాతల సహకారంతో నిర్విరామంగా అన్నదానం చేయడం చాలా సంతోష కరమన్నారు. విఆర్‌డిఎస్ చైర్మన్ సురేంద్రారెడ్డి మాట్లాడుతూ వంగిమల్ల లక్ష్మిరెడ్డి, వంగిమల్ల రామిరెడ్డి జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం నిర్వహించారన్నారు. అన్నదానానికి దాతలు ముందుకు రావాలన్నారు. ార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు రామకృష్ణమ రాజు, మల్లేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వంట ఏజెన్సీల నిర్వాహకులు రాజీనామా

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాలుగు వంట ఏజెన్సీలకు రాజీనామా చేసినట్లు, రాజీనామా పత్రాలను నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగిరెడ్డికి గురువారం అందజేసినట్లు మధ్యాహ్న భోజనం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.చాంద్‌బాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వంట ఏజెన్సీ ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్నా, అనివార్య కారణాల వల్ల నందలూరు కోర్టు జడ్జి వెంటనే తొలగించమని చెప్పారన్నారు. జడ్జి తీర్పును గౌరవిస్తూ రాజీనామా చేశామని పేర్కొన్నారు. పాటూరు యానాది కాలనీ అప్పర్ ప్రైమరీ స్కూల్, నందలూరులో రెండు ఉర్దూ స్కూల్లకు రాజీనామా చేశారని తెలిపారు. ఈ నాలుగు వంట ఏజెన్సీలకు సంబంధించి పెండింగ్ వేతనాలు చెల్లించాలని మండల విద్యాశాఖ అధికారిని కోరారు. సమావేశంలో నందలూరు వంట ఏజెన్సీ అధ్యక్షులు సాంబశివయ్య, జిల్లా నాయకులు ఆదినారాయణ పాల్గొన్నారు.

సైన్స్‌లో నానో టెక్నాలజీదే భవిష్యత్తు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

భవిష్యత్తు కాలంలో సైన్స్ పరిజ్ఞానం పెంచడంలో నానో టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తుందని కల్పగం హోమీ బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ డాక్టర్ జాన్ ఫిలిప్స్ పేర్కొన్నారు. గురువారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో ఆధునిక సమాజంలో సైన్సు, పరికరాల పాత్ర గురించి సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో శివనాదర్ యూనివర్సిటీ కలవక్కం ప్రొఫెసర్ డాక్టర్ రాజేష్ పెరుమాళ్, కరెస్పాండెంట్ రాటకొండ గురు ప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవి, రాఘ వేంద్ర రమ్య, అమానుల్లా, ఉదయ్, విజయ్ పాల్గొన్నారు.

ఎపిఎన్‌జిఒ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

ఎపిఎన్‌జిఒ సంఘం ఎన్నికలు గురువారం స్థానిక ఎన్‌జిఒ హోంలో జరిగాయి. ఎన్నికల అధికారిగా పుత్తూరు తాలూకా అధ్యక్షులు బి.గిరిప్రసాద్, సహాయ ఎన్నికల అధికారిగా ఈ.శేఖర్‌రెడ్డి, పరిశీలకులుగా కె.రమేష్ వ్యవహరించారు. ఈ ఎన్నికల ప్రక్రియలో ప్రతి పోస్టుకు ఒక్కొక్క అఫిడవిట్ మాత్రమే వచ్చింది. నామినేషన్ ప్రక్రియ జరిగిన తర్వాత ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షులుగా ఎస్.నరసింహారెడ్డి, అధ్యక్షులుగా కె.గిరిధర్‌రెడ్డి, సహాయ అధ్యక్షులుగా బి.ఎం.భాస్కర్, కె.ఆదివెంకటేశ్వర్లు, పి.హరిమోహన్ రెడ్డి, ఎన్.విజయకుమార్‌రెడ్డి, సి.రెడ్డిశేఖర్, సంయుక్త కార్యదర్శులుగా ఎం.వెంకటరమణ, జి.నాగరత్న, జి.ఎస్.శేఖర్, జి.సోమశేఖర్, ఉమెన్ కార్యదర్శిగా కె.వీఎ, కోశాధికారిగా ఎం.ప్రసాద్ నాయక్, డిఆర్ మెంబర్‌గా పి.హేమావతిరెడ్డిలను ఎన్నుకున్నారు. అధ్యక్షులు నరసింహారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. ఎన్నికైన నూతన కార్యవర్గానికి జిల్లా అధ్యక్షులు రాఘవులు, జిల్లా కార్యదర్శి రఘు, అసోసియేషన్ యూనిట్‌కి శుభాకాంక్షలు తెలియజేశారు.

జోరుగా అక్రమ మద్యం వ్యాపారం.. పట్టని పోలీసులు



గాలివారిపల్లి రహదారిలో గుట్టలుగా ఉన్న మద్యం సీసాలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల వ్యాప్తంగా అక్రమంగా మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఇంటిలోనే మద్యం నిల్వ ఉంచుకొని అధిక ధరలకు విక్రయించగా, పట్టణ పరిధిలోని ఒక బార్‌లో తెల్లవారుజాము, అర్ధరాత్రిలో కూడా విచ్చలవిడిగా, బహిరంగంగా అధిక ధరలకు మద్యం విక్రయించినా పోలీసులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. నిషేధిత సమయంలో అక్రమ మద్యం విక్రయిస్తూ రూ.లక్షల వ్యాపారాలు నిర్వహిస్తున్నా కన్నెత్తి చూడని ఎస్ఇబి, పోలీసు అధికారులు మద్యం దుకాణం వద్ద మద్యం సేవిస్తున్నవారిని అదుపులోకి తీసుకొని కోర్టులో జరిమానాలు కట్టిస్తున్నారని మందుబాబులు పెదవి విరుస్తున్నారు. కనీసం చట్టంపైన అవగాహన లేని ఇద్దరు దళిత కూలీలు భువనగిరిపల్లె సమీపంలోని దుకాణం వద్ద మద్యం సేవిస్తుండగా పట్టణ పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని రాత్రి 8 గంటల వరకు స్టేషన్‌లో ఉంచుకుని కోర్టులో జరిమానా కట్టించారని, అనేకమంది అక్కడే మద్యం సేవిస్తుండడంతో ఇది నిషేధమని తెలియని ఆ కూలీలు తాము కూడా మద్యం సేవించామని, ఇక ముందు అలా చేయబోమని బతిమాలుకున్నా పోలీసులు వదలలేదని వారు ఆవేదన చెందారు. అమాయకుల పట్ల పోలీసుల తీరుకు ఇది మచ్చుకు ఒక ఉదాహరణ మాత్రమే. ఇలా అమాయకులపై పోలీసు జులుం ఎన్నో పర్యాయాలు చూసే ఉంటాం. బహిరంగ మద్యాన్ని నిర్మూలించే ఆలోచించి, అక్రమ కార్యకలాపాలను పోలీసులు అదుపుకొని చర్యలు చేపట్టినట్లు ఎప్పుడూ వినలేదు. కనీసం. గాలివారిపల్లెకు సమీపంలోని పొలాలలోనూ, ఎస్ఆర్ పెట్రోల్ బంక్ ఎదురుగా గల పొలాలలోనూ, మిట్టమీదపల్లె గట్టుపైన ఎక్కడపడితే అక్కడ విచ్చలవిడిగా మందుబాబులు మద్యం సేవిస్తున్నా అలాంటి వారి పైన ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. కాస్తో కూస్తో రాజకీయ అండదండలు కలిగిన వారికి, ఆర్థిక బలం కలిగిన వారిని పోలీసులు పట్టించుకోరని.. అమాయక ప్రజలే వారికి టార్గెట్ అని చర్చించుకుంటున్నారు. భువనగిరిపల్లె సమీపంలో గల మద్యం దుకాణం వద్ద మందు బాబుల వికృత చేష్టల వలన నృసింహ స్వామి ఆలయానికి వెళ్లే భక్తులకు, పాఠశాల, కళాశాలకు వెళ్లే విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉండడంతో గతంలో భువనగిరిపల్లె గ్రామస్తులు మద్యం దుకాణం వద్ద ధర్నా చేసినప్పటికీ షరా మామూలే అన్నట్లుగా అక్కడ మందు బాబుల గోల యథావిధిగా కొనసాగుతూనే ఉంది. ఆ మద్యం దుకాణం వద్దకు ఎప్పుడు వెళ్లినా మద్యం సీసాలు, గ్లాసులు గుట్టలుగా దర్శనమిస్తాయి. మద్యపానానికి అనుమతి లేని దుకాణం వద్ద మద్యం సేవించడానికి అన్ని సీసాలు ఎలా వచ్చాయన్న తరహా తనిఖీలు వెళ్లే ఎస్ఈబి సిబ్బందికి తెలియదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కేవలం భువనగిరి పల్లెకు సమీపంలోని మద్యం దుకాణం వద్దే కాకుండా ప్రభుత్వం నిర్వహిస్తున్న అన్ని మద్యం దుకాణాల వద్ద దాదాపు ఇదే పరిస్థితి నెలకొని ఉంది. వీటి పైన పోలీసులు గాని, ఎస్ఈబి అధికారులు గానీ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ప్రజలకు ఇబ్బంది కలిగించే ఇలాంటి స్థావరాల పైన, నిరంతరాయంగా మద్యం అమ్మకాలు చేసే బార్ పైన పోలీసులు చర్యలు చేపట్టకుండా అమాయక ప్రజల పైన వీరంగం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

'హౌసింగ్ లేఅవుట్‌లలో మౌలిక వసతులు కల్పించాలి'

ప్రజాశక్తి - రాయచోటి

జగనన్న హౌసింగ్ లేఔట్‌లలో అన్ని మౌలిక వసతులు కల్పించి ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్‌శర్మ అన్ని జిల్లాల కలెక్టర్లు, జెసిలను ఆదేశించారు. గురువారం వెలగపూడి సచివాలయం నుంచి హౌసింగ్, స్పందన, రీసర్వే తదితర అంశాల పై జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ గిరీష, జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాల పనులను ముమ్మరం చేయాలన్నారు. హౌసింగ్ లేఅవుట్లలో అన్ని మౌలిక వసతులు కల్పించి నిర్దేశించిన గడువు లోపల లేఅవుట్లు పూర్తయ్యేందుకు చర్యలు చేపట్టాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన గ్రీవెన్స్ సంబంధించి బియాండ్ ఎస్ఎల్‌బిలోకి పోకుండా నాణ్యతతో గడువులోగా అర్జీలను పరిష్కరించాలన్నారు. జగనన్న హౌసింగ్ లే అవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలు నిర్లక్ష్యం చేయరాదన్నారు. లబ్ధిదారులకు ఇసుక, సిమెంటు, స్టీలు సకాలంలో ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఎక్కడైనా ఇసుక సమస్య ఉన్నట్లయితే వెంటనే సంబంధిత ఆర్‌డిఒ, తహశీల్దార్లకు తెలియజేసి సమస్య పరిష్కరించుకోవాలన్నారు. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టాయని ఇకనుంచి కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు ముమ్మరం చేయాలన్నారు. రీసర్వే కు సంబంధించి జిల్లాల అవసరమైన సర్వేయర్లు, సిబ్బంది పుష్కలంగా ఉన్నారని రీ సర్వే పనులు వేగవంత గా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా, డిఆర్ఒ సత్యనారాయణ, హౌసింగ్ పీడీ శివయ్య, ల్యాండ్ అండ్ సర్వే ఏడీ జయరాజ్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి : ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా


ప్రజాశక్తి-నిమ్మనపల్లి

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి డి.నరసింహులు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. మూడు నెలలలో మండల వ్యాప్తంగా జరిగిన అభివృద్ధి కార్యక్రమాలపై అన్ని శాఖల అధికారులతో, ప్రజా ప్రతినిధులతో సమీక్షించారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నాదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథక ఫలాలను అందించాలని తెలిపారు. సమగ్ర నివేదికతోరాని అధికారులపై మండిపడ్డారు. అధికారులు పనితీరు మార్చుకోవాలని, ప్రజా ప్రతినిధులతో కలసి పని చేయాలని తెలిపారు. రాచవేటివారి పల్లి సర్పంచ సుబ్రమణ్యం రాచవేటివారిపల్లి గ్రామంలో అర్హులైన వారికి జగనన్న పక్క గృహాలను కేటాయించటానికి మూడు ఎకరాల స్థలాన్ని గుర్తించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఎమ్మెల్యే తహశీల్దార్‌కు స్థలాన్ని గుర్తించాలని ఆదేశించారు. నాడు నేడు పనులు మందకోడిగా జరుగుతున్నాయని పనుల్లో వేగం పెంచాలని ఎంఇఒకు సూచించారు. మదనపల్లి నుంచి నిమ్మనపల్లి మీదుగా వాల్మీకిపురానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఆ మేరకు ఆర్టీసీ అధికారులకు బస్సును ఏర్పాటు చేయడానికి కృషి చేయాలన్నారు. ప్రతి అధికారి బాధ్యతగా పనిచేయాలని, పని వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ముందుగా ముష్టూరు పంచాయతీ దిగువపల్లిలో మండల వైసిపి ఇన్‌ఛార్జి ఆర్ఐ. రమణారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు రెడ్డిశేఖర్‌రెడ్డి, ఆర్‌బికె చైర్మన్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలతో కలసి 150 మీటర్ల సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. నూతనంగా ఆధునికీకరించిన స్థానిక సింగల్ విండో కార్యాలయాన్ని భవనాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి జయప్రకాశ్ రెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యులు మహమ్మద్ రఫీ, సర్పంచులు ఉషారాణి, శ్రీవాణి, సుబ్రమణ్యం, మహాదేవ రెడ్డి, రెడ్డమ్మ నరేంద్రరెడ్డి, వరలక్ష్మి, చంద్రాయుడు, రెడ్డప్ప, పాపులమ్మ, ఎంపిటిసిలు రెడ్డివెంకటేష్, నాయకులు నరేంద్రరెడ్డి, నవీన్, దయాకర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, రవి, చంద్రమోహన్, ఎంపిడిఒ లీలా మాధవి, తహశీల్దార్ సిఆర్.మంజుల, ఎస్ఐ ఫాతిమా, అధికారులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలి : 'సుగవాసి'

ప్రజాశక్తి - రాయచోటి

నందమూరి తారకరత్న నటించిన సారధి సినిమా స్పెషల్ షో రాయచోటిలోని గౌతమ్ థియేటర్లో విద్యార్థులతో కలిసి టిటిడి పాలక మండలి మాజీ సభ్యులు, టిడిపి నాయకులు సుగవాసి ప్రసాద్‌బాబు గురువారం వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచభూత క్రియేషన్స్ నందమూరి తారకరత్న హీరోగా నటించిన సారధి సినిమా బాగుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఖోఖో క్రీడలను ప్రోత్సహించి నేటి విద్యార్థులకు తెలియజేసే విధంగా సినిమా చాలా విజయవంతంగా ఉందని పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సుగవాసి ప్రసాద్ బాబును యూత్ ఐకాన్ వినయ్ కుమార్ శాలువాతో సత్క రించి ఘనంగా స్వాగతం పలికారు. విద్యార్థులకు మంచి ప్రతిభను కనబరిచే చిత్రాన్ని విద్యార్థుల కోసం ఉచిత షోకు సహకరించిన ప్రసాద్ బాబుకు వినయ్ కుమార్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసారు.



ప్రసాద్‌బాబును సన్మానిస్తున్న హీరో తారకరత్న అభిమానులు

సారధి సినిమాను వీక్షించిన డిఇఒ : నందమూరి తారకరత్న నటించిన సారధి సినిమా స్పెషల్ షో సందర్భంగా గౌతమ్ థియేటర్లో విద్యార్థిని విద్యార్థులతో కలిసి డిఇఒ రాఘవరెడ్డి, మానవతా చైర్మన్ శివగంగిరెడ్డి వీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సారధి సినిమా విద్యార్థులకు మంచి సందేశాన్ని ఇచ్చేలా ఈ చిత్రం ఉందన్నారు. ఇలాంటి సినిమాను విద్యార్థుల కోసం స్పెషల్ షో ఏర్పాటు చేసిన వినయ్ కుమార్‌ను అభినందించారు.

నాడు-నేడుతో విద్యా రంగంలో నూతన ఒరవడి

ప్రజాశక్తి-రామాపురం

ప్రభుత్వం విద్యారంగంలో తలపెట్టిన నాడు-నేడుతో నూతన ఒరవడి ఏర్పడిందని లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి అన్నారు. మండలంలోని కసిరెడ్డి వారిపల్లి పంచాయతీ, కొత్త రోడ్డు నారాయణపురంలో గురువారం జడ్‌పిటిసి మాసన వెంకటరమణ, వైసిపి మండల కన్వీనర్ జనార్ధన్ రెడ్డితో కలిసి అంగన్వాడీ కేంద్రానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి విద్య రంగంలో నూతన ఒరవడి తీసుకురావడానికి నాడు-నేడు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. మండలంలో మొదటి విడతలో కొన్ని పాఠశాలలో రెండో విడతలో అంగన్వాడి కేంద్రాలతో కలిపి 53 పాఠశాలలను ఎంపిక చేసి అధునాతన వసతులతో నిర్మాణ కార్యక్రమం చేపట్టారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు తీసిపోని విధంగా విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. నాడు నేడు ప్రోగ్రాం దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు నారాయణ, రఘురామయ్య, ఉపసర్పంచ్ మామిళ్ళ శివ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తిమ్మారెడ్డి సుధాకర్, మోహన్, హసనాపురం, సుబ్బయ్య, అధికారి వెంకటసుబ్బయ్య, ముబారక్, సచివాలయ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ విశ్వనాథ్, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని డిబిఎన్ పల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ రఘునాథరాజు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని ఆకాంక్షించారు. విజన్స్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు పోతుగుంట రమేష్ నాయుడు మాట్లాడుతూ అట్టడుగునున్న పేద విద్యార్థులకు సహాయం చేయడంలో తమ సంస్థ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు చంద్రారెడ్డి, రాజు, స్వర్ణలత, సుబ్రహ్మణ్యం రెడ్డి, గీత, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు తొలగింపు

ప్రజాశక్తి-నందలూరు

కడప చెన్నై జాతీయ రహదారిలోని కన్యకాచెరువు ఇరువైపులా కంప చెట్లు హైవే రోడ్డు పైకి రావడంతో జాతీయ రహదారికి ఇరువైపులా పెరిగిన చెట్లను ఎస్ఐ మైనుద్దీన్ ఆధ్వర్యంలో గురువారం తొలగించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా చెట్లు గుంపులుగా పెరగడంతో వాహనాల రవాణాకు, పాదచారులు వెళ్లేందుకు ఇబ్బందికరంగా ఉందని పేర్కొన్నారు. రమణ జెసిబి సహకారంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టా మన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ నాయక్, కానిస్టేబుల్ శివ శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి-కురబలకోట

వాల్మీకుల ఎస్‌టి జాబితాలో చేర్చాలని జిల్లా వాల్మీకి బోయ సంఘం జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసులు, విఆర్‌ఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పొదల నరసింహులు డిమాండ్ చేశారు. గురువారం తహశీల్దార్‌కి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల అడవీ ప్రాంతం, సామాజిక, రాజకీయ వెనుకబాటు గురించి పూర్తి అవగాహన కలిగిన ఎపివిబిఎస్, విఆర్‌ఎస్ఎస్ సంఘం పాలుపంచుకుని తద్వారా వాల్మీకి జాతికి సేవ చేసుకునే అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం మండల అధ్య క్షుడు రెడ్డినరసింహులు, జస్వంత్, శివ, లోకేష్, రవి, నరసింహులు పాల్గొన్నారు.

15 నుంచి కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపుపై సర్వే

ప్రజాశక్తి-కంభంవారిపల్లె

కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు నిర్వహించే సర్వేపై వైద్య సిబ్బందికి గురువారం గర్నిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ శ్యామల శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 15వ తారీకు నుండి డిసెంబర్ నెల ఐదో తేదీ వరకు 21 రోజులు పాటు కుష్టు వ్యాధిగ్రస్తుల్ని గుర్తించేందుకు ప్రత్యేక సర్వే కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రేష్మ, సామాజిక ఆరోగ్య అధికారి భాగ్యలక్ష్మి, పబ్లిక్ హెల్త్ నర్స్ రమాదేవి, ఆరోగ్య విస్తరణ అధికారులు కృష్ణమ్మ, కృష్ణయ్య, పర్యవేక్షకులు పురుషోత్తం, చెన్నమ్మ, సిహెచ్ఒలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు, సచివాలయ మేల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

బిసిలకు రిజర్వేషన్లు అమలు చేయాలి

ప్రజాశక్తి-కలికిరి

జనాభా ప్రాతిపధిక రిజర్వేషన్లు అమలు చేయాలని బిసి ఎంప్లాయిస్ ఫెడరేషన్ చిత్తూరు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కుమార్‌యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో బిసి ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసి కుల జన గణన చేసి జనాభా దామాషాతో వెనకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించడమే సముచితమన్నారు. అత్యధిక జనాభా 54 శాతం గల బిసిలకు 27 శాతం మాత్రమే రిజర్వేషన్ కల్పించారన్నారు. రిజర్వేషన్లు పారదర్శకంగా అమలుకు నోచుకోలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీలేరు నియోజకవర్గ బిసిఇఎఫ్ ప్రధాన కార్యదర్శి బాలాజి, కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, జనార్దన్, చంద్రశేఖర్, భాస్కర్, సురేష్, సహదేవ, చంద్రశేఖర్, సుధాకర్, ప్రతాప్, సుబ్రమణ్యం, మురళి, నిరంజన్ పాల్గొన్నారు.

టిప్పుసుల్తాన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

భారతదేశ తొలి స్వాతంత్ర్య సమరయోధుడు హజరత్ టిప్పుసుల్తాన్‌ను యువత స్ఫూర్తిగా తీసుకొని మెలగాలని బాస్ రాష్ట్ర అధ్యక్షులు పిటిఎం శివప్రసాద్, జామియా మసీదు ముతవల్లీ అబ్దుల్ అజీం అన్నారు. గురువారం హజరత్ టిప్పుసుల్తాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టిప్పు సుల్తాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ మైసూరు సామ్రాజ్య వ్యవస్థాపకులు టిప్పు సుల్తాన్ ఆంగ్లేయులను భారతదేశం నుంచి తరమిగొట్టడానికి తొలిసారిగా ముందుకు వచ్చిన భారతావని ముద్దుబిడ్డ అని, భారతదేశ ఔనత్యాన్ని చాటిన యోధుడని కొనియాడారు. పట్టణంలోని పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జవాద్‌హుస్సేన్, అబ్దుల్ కరీం, అమీర్ హుస్సేన్, సాధిక్, షాహెద్, ఇర్ఫాన్, సైదు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

గ్రామ సచివాలయ ఉద్యోగులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డిఎల్‌డిఒ లక్ష్మీపతి హెచ్చరించారు. గురువారం కన్యామడుగు, రేణుకలపల్లి గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. విధి నిర్వహణపై ఆరా తీశారు. సచివాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కారమయ్యే విధంగా చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఆనంద్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు చైతన్య, శాకమ్మ పాల్గొన్నారు.

పాఠశాలలో మరుగుదొడ్లకు భూమిపూజ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణంలోని జడ్పీ, ఉర్దూ హైస్కూల్‌లో నూతనంగా ఏర్పాటు చేయనున్న మరుగుదొడ్లకు గురువారం మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం ఎప్పుడు ముందు వరుసలో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సుమియా, ఎపిఆర్‌డిసి రాష్ట్ర డైరెక్టర్ గుల్జార్ బాషా, జామియా మస్జిద్ అధ్యక్షులు హైదర్‌బాషా, మున్సిపల్ కౌన్సిలర్ నయంతుల్లా, పాఠశాల కో-ఆప్షన్ సభ్యులు ఇనయంతుల్లా, మైనార్టీ నాయకులు ముజఫర్ అహ్మద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘురాం, ఉపాధ్యాయులు, ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

టిబి రోగులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం క్షయ వ్యాధి నివారణకు అనేక కార్యక్రమాలు చేపడుతోందని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆంజనేయలు అన్నారు. గురువారం స్థానిక ఆసుపత్రిలో నిర్ధారిత టిబి రోగులకు వారి సమ్మతితో దాతల సహకారంతో పౌష్టిక ఆహార పదార్థాలను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2025 లోపు క్షయవ్యాధిని నిర్మూలించాలని దృఢసంకల్పంతో అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంఒ డాక్టర్ దివాకర్, దాతలు విజయభారతి స్కూల్ కరెస్పాండెంట్ డాక్టర్ ఎస్.సేతు, మదనపల్లి టిబి యూనిట్ సిబ్బంది, ప్రభాకర్, దయాలన్, వనజకుమారి, సుశీల్, జ్ఞాన తిలగం, పార్థసారథి, జిల్లా ప్రధాన వైద్యాశాల డాక్టర్లు, నర్సులు పాల్గొన్నారు.

రూ.20 వేల ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలోని అమ్మచెరువుమిట్ట వెలుగు ప్రత్యేక పాఠశాల, వృద్ధాశ్రమానికి బెంగుళూరుకు చెందిన ఐటి ఉద్యోగి ఆర్.శ్రావణి రూ.20 వేలు విరాళం అందజేశారు. గురువారం ఆమె తన తల్లితో కలిసి వెలుగు ప్రత్యేక పాఠశాల, వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. విభిన్నప్రతిభావంతులు, వృద్దులకు ఆశ్రయం కల్పించి, వారికోసం నిరంతరం శ్రమిస్తున్న వెలుగు సెక్రటరీ ఉదయ్‌మోహన్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.